వీధికుక్కలు.. తప్పని ఇక్కట్లు!

- పీఏపల్లి మండల వ్యాప్తంగా శునకాల బెడద
- రోడ్ల మీద, వీధుల్లో స్వైరవిహారం
- కుక్క కాటుకు గురవుతున్న ప్రజలు, మూగజీవులు
- రక్షణ కల్పించాలని వేడుకోలు


పెద్దఅడిశర్లపల్లి సెంటర్‌లో కుక్కల స్వైర విహారం

పెద్దఅడిశర్లపల్లి: పెద్దఅడిశర్లపల్లి మండలంలో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. పగలు రాత్రి తేడా అనే లేకుండా రోడ్ల మీదు, వీధుల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఒక్కో గ్రామంలో వందల సంఖ్యలో కుక్కలు స్వైర విహారం చేస్తూ మనుషులు, మూగజీవులపై దాడి చేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయి. పెద్దఅడిశర్లపల్లితోపాటు అంగడిపేట తండా, దుగ్యాల,తిరుమలగిరి, మేడారం, అజ్మాపురం, బాలాజీనగర్, పోతిరెడ్డిపల్లి తదితర గ్రామాలలో వీధి కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. గ్రామంలోని వీధుల్లో, రోడ్ల వెంట తిరగాలంటే భయం వేస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో వీధుల్లో తిరుగుతూ అరుస్తుండడంతో నిద్రపట్టని పరిస్థితులు నెలకొంటున్నాయని ప్రజలు అంటున్నారు. పలుమార్లు పంచాయతీ అధికారులకు విన్నవించినా కుక్కల బెడద నివారించలేకపోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పెరిగిన కుక్కకాటు బాధితులు..

పెద్దఅడిశర్లపల్లి మండలంలో గతేడాది కంటే ఈ సంవత్సరం కుక్క కాటు కేసులు పెరిగాయి. గత సంవత్సరం మొత్తం 274 కేసులు నమోదు కాగా ఈ సంవత్సరం ఈనెల 13 వరకే పీఏపల్లి పీహెచ్‌సీలో 278 కుక్క కాటు కేసులు నమోదయ్యాయి. అంటే ప్రస్తుతం కుక్కకాటు కేసులు పెరుగుతూ పోతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుక్కలను నియంత్రించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కుక్కల బారి నుంచి కాపాడాలి



గ్రామాల్లో వీధికుక్కలు గుంపులుగా తిరుగుతూ మనుషులు, మూగజీవులపై దాడి చేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయి. ప్రాణాలు గుప్పట్లో పెట్టుకుని తిరగాల్సి వస్తుంది. రాను రాను కుక్క కాటు కేసులు పెరుగుతూ పోతున్నాయి. కుక్కల బారి నుంచి కాపాడాలి.

– పల్లె సత్యనారాయణగౌడ్, పెద్దఅడిశర్లపల్లి

వ్యవసాయాన్ని పండుగ చేసిన ఘనత కేసీఆర్‌దే


యల్లాపురంతండాలో బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): బీఆర్‌ఎస్ పాలనలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయాన్ని పండుగగా మార్చితే, రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో వ్యవసాయమే దండగ అనే విధంగా రైతులను రోడ్డు మీదకు తీసుకువచ్చిందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి విమర్శించారు. ఆదివారం మండలంలోని యల్లాపురం తండాలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో మంజూరు చేసిన పనులకే ప్రస్తుత ఎమ్మెల్యే కొబ్బరికాయలు కొడుతున్నాడే తప్పా, రెండేళ్ల కాలంలో ఆయన చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. కేసీఆర్ పాలనలో కృష్ణా జలాల్లో ఒక చుక్క నీరు కూడా దోపిడీకి గురి కాలేదని, కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆంధ్రా నాయకులు లక్షల క్యూసెక్కుల నీటిని దోచుకుపోతున్నా ఈ పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ప్రతిపక్ష పార్టీగా తాము మాట్లాడిన తరువాత ఈ నాయకులకు సోయి వచ్చిందని విమర్శించారు. అలాగే మండల కేంద్రానికి చెందిన ఫోటో, వీడియో గ్రాఫర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పసుపులేటి కృష్ణ కుమారుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి ఆ కుటుంబాన్ని పరామర్శించి, ప్రమాదానికి గల కారణం అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఆంగోతు సూర్యబాషా నాయక్, మాజీ ఎంపీపీ అల్లి పెద్దిరాజు, నాయకులు రమణరాజు, ముని నాయక్, బిక్షా నాయక్, ముత్తయ్య, కోట్యా, సతీష్‌రెడ్డి, అంజి, దేవు నాయక్, వెంకటేశ్వర్లు, లాలు, తావు, బాలు, రాజు, రఘు, రమేష్, బాబురావు, నరసరాజు తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలు పీఆర్‌టీయూతోనే పరిష్కారం


ప్రమోషన్ పొందిన సురేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ఉపాధ్యాయుల సమస్యలు పీఆర్‌టీయూతోనే పరిష్కారమవుతాయమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ఇటీవల స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోషన పొంది మండలంలోని రంగుండ్ల ప్రాథమికోన్నత పాఠశాలకు బదిలీపై వచ్చిన మంత్రాల సురేందర్ రెడ్డిని ఆయన ఆదివారం సన్మానించి మాట్లాడారు. ప్రమోషన్ పొందితో ఉపాధ్యాయుల బాధ్యత పెరుగుతుందన్నారు. ఆ బాధ్యతతోనే పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడాలని ఆయన సూచించారు. విద్యార్థుల్లో సృజనాత్మకమైన విద్యను అందించేందుకు కృషి చేయాలన్నారు. పీఆర్‌టీయూ పోరాట ఫలితంగానే ప్రభుత్వం ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించిందన్నారు. ఆ సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అసోసియేటెట్ అధ్యక్షులు మందా సైదులురావు గౌతమ్, బణావత్ సక్రు నాయక్, కొల్లు శ్రీనివాస్‌రెడ్డి,మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పరశురాం, కూన్‌రెడ్డి సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న బైరం దయానంద్

మిర్యాలగూడ : పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును కార్మికులు వినియోగించుకోవాలని సీఐటీయూ దామరచర్ల మండల కన్వీనర్ బైరం దయానంద్ అన్నారు. ఆదివారం దామరచర్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమ బోర్డులో పేర్లు నమోదు చేసుకోని ప్రతి ఒక్క కార్మికుడు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు కార్మికులను ఆదుకోవాలన్నారు. మృతిచెందిన కుటుంబాలకు ప్రభుత్వం రూ.10లక్షలు అందించాలని, 60ఏళ్లు దాటిన కార్మికులకు రూ.5వేల పింఛన్లు ఇవ్వాలని, ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు అందించాలన్నారు. అనంతరం భవన నిర్మాణ కార్మికుల మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పల్లా సుదర్శన్, ఉపాధ్యక్షుడిగా కొమ్ము రాజేశ్, గుండ్లపల్లి ఆంజనేయులు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో భూక్యా విజయ్, నరేందర్, నరసింహారావు, సైదులు, బ్రహ్మయ్య, రమేష్, రమణమ్మ, గోపి తదితరులు పాల్గొన్నారు.

17న విరాట్ విశ్వకర్మ మహా యజ్ఞం

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని చింతపల్లి బైపాస్ వద్ద శ్రీవిశ్వకర్మ కార్పెంటర్స్ యూనియన్ భవనంలో ఈ నెల 17న శ్రీవిరాట్ విశ్వకర్మ మహాయజ్ఞం నిర్వహించనున్నట్లు విశ్వకర్మ మహాయజ్ఞ మహోత్సవ కమిటీ చైర్మన్ పామోజు సోమాచారి తెలిపారు. ఆదివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అలాగే మహా అన్న ప్రసాద వితరణ ఉంటుందన్నారు. విశ్వకర్మలు కుటుంబ సమేతంగా పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో అధ్యక్షులు కొండోజు మల్లిఖార్జునచారి, వైస్ చైర్మన్ బంధనకంటి హనుమాచారి, కార్యదర్శి నర్సింగోజు రామాచారి, కమిటీ సభ్యులు వెంకటాచారి, మధనాచారి, సత్యనారాయణచారి, ఈశ్వరాచారి, బ్రహ్మచారి, శ్రీనివాసాచారి, బంధనకంటి నాగాచారి, నాగేందర్‌చారి, లక్ష్మీనారాయణచారి, వెంకటరమణాచారి, మధు ,శంకర్, రమేష్‌చారి, సురేష్‌చారి,, రామాచారి, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

సిరివెన్నెలకు జాతీయ స్థాయి అవార్డు


అవార్డు అందుకుంటున్న సిరివెన్నెల

మిర్యాలగూడ : పట్టణంలోని సిరిమువ్వ నాట్యాలయానికి చెందిన శ్రీపాద సిరివెన్నెల జాతీయ స్థాయి కూచిపూడి నృత్యం పోటీల్లో ప్రథమ స్థానం సాధించి అవార్డు అందుకుంది. ఈ సందర్భంగా నాట్య గురువు కలకొండ రాము మాట్లాడుతూ సిరిమువ్వ నాట్యాలయంలో ఎంతో మంది చిన్నారులు కూచిపూడి నేర్చుకొని అవార్డులు సాధించారని తెలిపారు. శనివారం సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు యూనివర్సిటీ ఎన్‌టీఆర్ ఆడిటోరియంలో శ్రీ వెంకటేశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి కూచిపూడి నృత్య పోటీల్లో సిరి వెన్నెల ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని సాధించడం అభినందనీయమన్నారు. సిరివెన్నెల 2023 నుంచి ఇప్పటివరకు ఎన్నో బహుమతులు అందుకుందని మరిన్ని అవార్డులు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

విద్యార్థులకు హాస్టళ్లలో సౌకర్యాలు మెరుగుపర్చాలి

నల్లగొండ: వసతి గృహ విద్యార్థులకు వసతి సౌకర్యాలు మెరుగుపర్చాలని నల్లగొండ మండల ప్రత్యేక అధికారి రమేష్ అన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వ ఎస్సీ కళాశాల హాస్టల్ (సి)లో నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల విద్యపై దృష్టి కేంద్రీకరించాలని హాస్టల్ నిర్వాహకులకు, ఉపాధ్యాయులకు సూచించారు. హాస్టల్ సౌకర్యాలను ఉపయోగించుకుని విద్యార్థులు బాగా చదివి ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు, అధికారులు కలిసి భోజనం చేశారు. సమావేశంలో వసతి గృహ సంక్షేమ అధికారి ఏ.సత్యనారాయణ, కేపీఎం జూనియర్ కాలేజ్ అధ్యాపకులు వేణుగోపాల్, సీహెచ్ లింగం, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి రమేష్

యూరియా కోసం రైతులు బారులు


తిరుమలగిరి(నాగార్జునసాగర్) : యూరియా టోకెన్ల కోసం సబ్‌మార్కెట్ యార్డులో క్యూలైన్‌లో నిలుచున్న మహిళా రైతులు


కొండమల్లేపల్లి : యూరియా కోసం బారులుదీరిన రైతులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : యూరియా సమస్య రైతులను వెంటాడుతూనే ఉంది. పంటలు సాగు చేసి నెలల గడుస్తున్నప్పటికీ రైతులకు యూరియా తిప్పలు మాత్రం తప్పడం లేదు. తిరుమలగిరి మండలానికి ప్రత్యేకంగా పీఏసీఎస్ లేకపోవడంతో ఉమ్మడి అనుముల మండలంగానే కొనసాగుతుంది. దీంతో ఇక్కడి రైతులు యూరియా తెచ్చుకోవాలంటే హాలియాకు వెళ్లాల్సి వస్తుంది. ఈ క్రమంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటంతో పాటు అధనంగా ఖర్చు కూడా అవుతుంది. రైతుల విజ్ఞప్తి మేరకు అధికారులు ఆదివారం స్థానిక వ్యవసాయ సబ్‌మార్కెట్ యార్డులో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి టోకెన్లను అందించారు. ఈ విషయం తెలుసుకున్న రైతులు తెల్లవారుజాము నుంచే క్యూ లైన్‌లో బారులుదీరారు. తిరుమలగిరి మండలానికి 80మెట్రిక్ టన్నుల యూరియా రాగా డొక్కలబావితండాలో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం ద్వారా 40మెట్రిక్ టన్నులు, తిరుమలగిరి మార్కెట్ యార్డులో 40మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేశారు. రైతుకు రెండు బస్తాల చొప్పున అందించారు.

కొండమల్లేపల్లి : యూరియా కోసం రైతులు చుట్టుపక్కల మండలాల నుంచి వేకువ జాము నుంచే మండల కేంద్రానికి వస్తున్నారు. ఆదివారం రైతులు ఒకేసారి రావడంతో స్థానిక ఎస్‌ఐ అజ్మీరా రమేశ్, ఏఓ జానకి రాములు సాగర్‌రోడ్డులోని వ్యవసాయ సబ్ మార్కెట్‌యార్డు వద్ద రైతులను క్యూలైన్‌లో నిల్చోబెట్టి ఒక్కో రైతుకు ఒక్కో బస్తా చొప్పున టోకెన్లు పంపిణీ చేశారు. పట్టణంలోని మూడు ఫర్టిలైజర్ దుకాణాలకు 20 టన్నులు దాదాపుగా 440 బస్తాల యూరియా రావడంతో రైతులకు ఇచ్చిన టోకెన్లపై ఆ షాపు పేరు రాసి ఇవ్వగా రైతులు అక్కడికి వెళ్లి యూరియా తీసుకున్నారు. మిగిలిన 350 మంది రైతులకు మళ్లీ లోడ్ వచ్చాక ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. చుట్టుపక్కల మండలాలైన నాంపల్లి, చింతపల్లి, పెద్దఅడిశర్లపల్లి, గుడిపల్లి, పెద్దవూర, గుర్రంపోడు, డిండి, దేవరకొండ, నేరెడుగొమ్ము, చందంపేట నుంచి కూడా రైతులు కొండమల్లేపల్లికి యూరియా కోసం రావడంతో ఈ రద్దీ పెరిగిందని చెప్పొచ్చు. ఆయా మండలాలలో కూడా యూరియా కొరత ఉండటం రైతులు కొండమల్లేపల్లికి వస్తున్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యేకు ఆహ్వానం


ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఉత్సవ సమితి సభ్యులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని ఎన్‌ఎస్‌పీ క్యాంపులో నిర్వహించే దుర్గామాత 28వ వార్షికోత్సవ సంబరాల ఆహ్వాన పత్రికను ఆదివారం మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఈనెల 17న ప్రత్యేకంగా పూజలను ప్రారంభిస్తున్నందున తప్పకుండా రావాలని, అక్టోబరు 2న నిర్వహించే విజయదశమి వేడుకలను కూడా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో మిర్యాలగూడ హిందూ ఉత్సవ సమితి అధ్యక్ష, కార్యదర్శులు యడవల్లి శ్రీనివాస్‌రెడ్డి, రేపాల పురుషోత్తంరెడ్డి, గాయం ఉపేందర్‌రెడ్డి, చిలుకూరి శ్యాం, దేశిడి శేఖర్‌రెడ్డి, గొదాల జానకి రాం రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చిల్లంచర్ల అభి, గుండ్లపల్లి శ్రీకాంత్, బాషిపాక శంకర్ తదితరులున్నారు.

పచ్చని చెట్లు బొగ్గుపాలు


బంగారుకుంట తండాలో బొగ్గుబట్టీకి వేర్చిన కలప

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి మండలం బంగారుకుంట గ్రామ సమీపంలో బొగ్గుబట్టీల కోసం పచ్చని చెట్లను నరికి బొగ్గుబట్టీల నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలో బొగ్గుబట్టీలు యథేచ్ఛగా సాగుతున్నప్పటికీ అధికారులు మాత్రం నిమ్మకునీరేత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఈ కట్టెల ద్వారా బొగ్గును తయారు చేసి మిర్యాలగూడలోని పలు హోటళ్లకు సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. బొగ్గుబట్టీల ద్వారా వెలువడుతున్న కాలుష్యాన్ని నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

18 వరకు ఓపెన్ ఇంటర్, టెన్త్ అడ్మిషన్లకు గడువు

త్రిపురారం : తెలంగాణ ఓపెన్ స్కూల్‌లో పదోతరగతి, ఇంటర్మీడియెట్‌లో అడ్మిషన్లు పొందేందుకు ప్రభుత్వం ఈ నెల 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు చెన్నాయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఓపెన్ స్కూల్ కోర్డినేటర్ ఉమ్మడి సైదిరెడ్డి, సహాయ కోఆర్డీనేటర్ మాలోతు దశరథ నాయక్‌లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి అడ్మిషన్ కోసం రికార్డు షీట్, ఆధార్ కార్డు, పాస్ ఫొటో, కులధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌ఫొటోలు, ఇంటర్ అడ్మిషన్ కోసం పదోతరగతి పాస్ మెమో, టీసీ, ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం, రెండు పాస్ ఫొటోలతో రావాలన్నారు. ఓపెన్‌స్కూల్‌లో అడ్మిషన్ పొందాలనుకుంటే చెన్నాయిపాలెం ఉన్నత పాఠశాలలో సంప్రదించాలని కోరారు. పూర్తి వివరాలకు 9849573645,8555917912 ఫోన్ నెంబర్‌లను సంప్రదించాలని తెలిపారు.

స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి


మాట్లాడుతున్న నాగరాజు

మిర్యాలగూడ టౌన్ : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని ప్రొగ్రెసివ్ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని శాంతినగర్‌లోని పీఎస్‌యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఉన్నత చదువులు చదువుతున్నారని, ఫీజురీయింబర్స్‌మెంట్ వంటి బకాయిలను చెల్లించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఈ సమావేశంలో సంఘం కన్వీనర్ మచ్చ వంశీ, కో కన్వీనర్ నల్లగంతుల అజయ్, డివిజన్ కన్వీనర్ రవి, శంకర్, సాయి, అజయ్, ఫయాజ్ తదితరులున్నారు.

నేడు ఎస్‌జీఎఫ్ ఎంపిక పోటీలు

గుర్రంపోడు : ఈ నెల 15న మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌లో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి నోముల యాదగిరి తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలకు బాలురను, బాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆలయంలో ఉట్లోత్సవం


పూజలో పాల్గొన్న భక్తులు

కొండమల్లేపల్లి(చింతపల్లి) : చింతపల్లి మండల పరిధిలోని గొడకొండ్ల గ్రామంలోని వెంకటేశ్వరనగర్ కొండపై నెలకొన్న శ్రీవారి ఆలయంలో వైష్ణవ ఆచారం ప్రకారం ఉట్లు కొట్టే వేడుకను ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ సమీపంలో యాదవులు ఉట్లు కొట్టే వేడుకను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తదుపరి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పూరె లక్ష్మణ్, మాజీ ఎంపీపీ కొండూరి భవాని పవన్ కుమార్, ధర్మకర్తలు భక్తులు పాల్గొన్నారు.

ఈద్గాలో వనమహోత్సవం


అవంతీపురం ఈద్గాలో మొక్క నాటుతున్న ముస్లింలు

మిర్యాలగూడ : మండలంలోని అవంతీపురం గ్రామ శివారులో ఈద్గాలో మస్జీద్ అరాఫత్ పర్యవేక్షణలో ముస్లింలు ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా సుమారు 250మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా గతంలో సుమారు 2వేల మొక్కలను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నాటి వాటికి డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి పరిరక్షించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ హఫీజొద్దీన్, ఎండీ మహబూబ్‌అలీబాబా, ఖుర్బాన్‌అలీ, సోనిసమద, మోయినొద్దీన్, జమాత్ పాషా, ఖాజా నాజీమొద్దీన్, అస్లాం, నామిద్, ముజీబ్, పర్వేజ్, జహంగీర్, ఖాజా హమీదొద్దీన్, వెంకన్న పాల్గొన్నారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం అందజేత


నిడమనూరు : ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

నిడమనూరు : అనారోగ్యానికి గురైన మిత్రుడికి తన పదో తరగతి మిత్రులు ఆర్థికసాయం అందించి, ఆపాదలో అండగా నిలిచారు. తుమ్మడం గ్రామానికి చెందిన రవికుమార్ ఇటీవల కిడ్నీ సంబంధిత సమస్యతో అనారోగ్యానికి గురై డయాలసిస్ సేవలు పొందుతున్నారు. దీంతో రవి కుమార్ సహచర పదో తరగతి(1989–90) విద్యార్థులు తెలుసుకొని, ఆదివారం మిత్రుడు రవిని పరామర్శించి, రూ.33వేల ఆర్థికసాయం అందించారు. రవిని కలిసిన వారిలో స్నేహితులు గడ్డం సైదిరెడ్డి, రాం రెడ్డి, నరేందర్, ఏడుకొండులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని ఆరో వార్డులో తంగేళ్ల వెంకటేశ్వరరాజు అనారోగ్యంతో మృతిచెందాడు. ఈవిషయం తెలుసుకున్న స్థానిక మాజీ వార్డు కౌన్సిలర్ సాధినేని శ్రవంతి శ్రీనివాస్‌రావు సహకారంతో అమ్మనాన్న చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆ కుటుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ట్రస్టు సభ్యులు తదితరులున్నారు.

సాగర్‌లో పర్యాటకుల సందడి


లాంచీ దిగి వస్తున్న పర్యాటకులు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 గేట్లు ఎత్తడంతో సాగర్ అందాలను చూసేందుకు ఆదివారం పర్యాటకులు భారీగా వచ్చారు. ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటూ ఆనందంగా గడిపారు. లాంచీల్లో నాగార్జునకొండకు వెళ్లి సందర్శించారు. జాతకవనం, స్థూప పార్కు, తపోవనం తదితర ప్రాంతాల్లో పర్యాటకులు కిటకిటలాడారు.

యోగా సాధకుడు కోల సైదులుకు సన్మానం

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణ యోగా టీచర్స్ ఉమ్మడి జిల్లా చైర్మన్, మిర్యాలగూడ యోగాసాధకులు కోల సైదులును హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, అంభ్యతర కార్యాలయాల మంత్రి కిషన్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. అనంతరం యోగా ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భరంగా కోల సైదులు మాట్లాడుతూ హైదరరాబాద్‌లో ప్రపంచ యోగా దినోత్సవంలో భాగంగా రాష్ట్ర నలుమూలల నుంచి 50వేల మంది వరకు హాజరయ్యారని తెలిపారు. భవిష్యత్‌లో యోగా విస్తరణకు తనవంతు కృషి చేస్తానన్నారు. పట్టణానికి చెందిన యోగసాధకులు కోల సైదులును మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న సైదులు

కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలి

నల్లగొండ: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండలో నిర్వహించిన ఎస్‌ఆర్ జూనియర్ కాలేజీ ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం వివిధ విభాగాల్లో ఉత్తమంగా రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్ జూనియర్ కళాశాల, పాఠశాల జోనల్ ఇన్‌చార్జ్ దోనాల శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ జోనల్ సతీష్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ మనోజ్ రెడ్డి, రూప, డీన్ కిశోర్ పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారి


బాబుసాయిపేట నూతన బ్రిడ్జి వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలు

త్రిపురారం : మండలంలోని బాబుసాయిపేట వద్ద నూతన బ్రిడ్జి నిర్మాణంలో ఉన్న ప్రాంతంలో నడి రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతంలో నూతన బ్రిడ్జి నిర్మిస్తున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ఐదేళ్ల నుంచి పనులు కొనసాగిస్తున్నారు. మండల కేంద్రం నుంచి కుక్కడం వెళ్లే డబుల్ రోడ్డు కావడవడంతో నిత్యం వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. బ్రిడ్జి నిర్మాణానికి రెండు వైపులు పెద్ద పెద్ద మట్టి కుప్పలు పోసీ వదిలేయడంతో రాత్రి వేళలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు గుంతలు పడిన ప్రాంతాన్ని పరిశీలించి రోడ్డుపై గుంతలు పూడ్చాలని మండల ప్రజలు కోరుతున్నారు. అలాగే నిర్లక్ష్యంగా ఉన్న అధికారులు, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.